# 2

# మెసొపొటేమియా నాగరకత

**( Mesopotamia Civilization )**

## నదీలోయలలోని ప్రాచీన నాగరకతా కేంద్రాలు

మానవ సంస్కృతి ప్రప్రథమంలో నదీలోయలలో పెంపొందింది. యూఫ్రేటీజ్–టైగ్రిస్ లోయ (Euphrates–Tigris valley), ఈజిప్టులోని నైలునదీ లోయ, భారతదేశంలో సింధునదీ లోయ (Indus valley), చైనాలోని హ్వాంగ్ – హో – యన్ – జూ లోయ (Hoang–ho–yang–tze) మొదలైనవి ప్రాచీన నాగరకతా కేంద్రాలుగా విలసిల్లినాయి. ఆ ప్రాంతాలలో ఎడతెగని నీటి సరఫరా, నదీ ప్రవాహంతో వచ్చిన ఒండ్రుమట్టివల్ల ఏర్పడిన సారవంతమైన నేలలు ఉండడం, నాగరకత నదీలోయలలోనే పుట్టడానికి ప్రధాన కారణాలు. అనువైన నేలలు, శీతోష్ణస్థితి, ఉండడంవల్ల మానవుడు కేవలం తన జీవనానికి కావలసినదానికన్నా అధికంగా ఇక్కడ ఉత్పత్తిని సాధించగలిగినాడు. ఈ ప్రాంతాలలో మానవుడు తన సర్వశక్తులనూ జీవనోపాధికే వినియోగించక సంఘాభివృద్ధికి పాటుపడినందువల్ల వివిధ సాంఘిక వృత్తులు, వ్యవస్థలు పెరిగి నాగరకత అభివృద్ధి చెందింది.


ప్రాచీన నాగరకతలలో ప్రప్రథమంలో ఏర్పడ్డ నాగరకత ఏదన్న విషయము వివాదాస్పదంగా ఉంది. కొందరు ఈజిప్టు నాగరకత మొదటిదంటే కొందరు యూఫ్రేటీజ్–టైగ్రిస్ లోయ నాగరకత అనీ, మరికొందరు పర్షియాఖాతందగ్గరి ఈలంలో వృద్ధిచెందిన నాగరకత అనీ అభిప్రాయపడుతున్నారు. కాని, ఇటీవల జరిగిన పురావస్తు పరిశోధనల ప్రకారం ఈ ప్రథమస్థానం యూఫ్రేటీజ్–టైగ్రిస్ లోయ నాగరకతదే అని చెప్పవచ్చు. యూఫ్రేటీజ్–టైగ్రిస్ నాగరకతకు అంకురార్పణ జరిగింది సుమారు క్రీ. పూ. 4000 సంవత్సరంలో.

ఇప్పటికి సుమారు 6000 సంవత్సరాల పూర్వకాలంనుంచి మాత్రమే ప్రపంచ చరిత్ర వ్రాయడానికి పనికివచ్చే లిఖితపూర్వక మైన ఆధారాలు లభిస్తున్నాయి. మనమెరిగినంతవరకూ ఇందులోని మొదటి 3000 సంవత్సరాలలో మానవనాగరకతా కేంద్రాలలో విల సిల్లినది సమీప ప్రాచ్యము (Near East). నైరృతి ఆసియా, నల్ల సముద్ర పరిసరాలు, పశ్చిమ భారతదేశము, ఆఫ్ఘనిస్తాన్, ఈజిప్టు ప్రాంతాలను సమీప ప్రాచ్యమంటారు. ప్రపంచ నాగరకతలోని వివిధరంగాలకు ప్రారంభం జరిగింది ఇక్కడే. తరువాత వృద్ధిచెందిన క్రీట్, గ్రీస్, రోమ్ నాగరకతలు సమీపప్రాచ్య సంస్కృతిలోని అనేక విషయాలను సంగ్రహించినాయి.

## సారవంతమైన చంద్రరేఖ (Fertile Crescent)

(దేశ పటము 1)

నేటి ఇరాక్ (Iraq) దేశంలో ప్రవహించే ముఖ్య నదులు యూఫ్రేటీజ్, టైగ్రిస్. ఈ నదులు ఆసియా మైనర్ (Asia Minor) పర్వతాలలో జన్మించి, ఆగ్నేయ దిశగా పర్షియాఖాతం (Persian Gulf) వైపుకు ప్రవహిస్తున్నాయి. ఈ నదుల లోయలకు ఉత్తరాన నల్ల సముద్రము, కాస్పియన్ సముద్రము ఉన్నాయి. నైరృతిదిశలో అరేబియా దేశముంది. పడమటగా సిరియా, ప్రాచీన పాలస్తీన్ ఉన్నాయి. నేడు సిరియా, అరేబియాలలో చాలాభాగం ఎడారి ప్రదేశంగా ఉన్నా, క్రీ. పూ. 4000 ప్రాంతంలో పర్షియాఖాతంనుంచి ఉత్తర అరేబియాతో సహా పాలస్తీన్‌వరకూ సారవంతంగా ఉండేది. ఈ సారవంతమైన భూభాగం అర్ధచంద్రాకారంగా ఉన్నందువల్ల దీన్ని చరిత్రకారులు సారవంతమైన చంద్రరేఖ (Fertile crescent) అంటు న్నారు. మానవచరిత్రలో అతిప్రాచీనమైన మెసొపొటేమియా నాగరకత ఇక్కడే పెంపొందింది.




దేశపటము 1.

సారవంతమైన చంద్రరేఖ (Fertile crescent)

## మెసొపొటేమియా నాగరకత

యూఫ్రేటీజ్–టైగ్రిస్ నదీలోయలో వృద్ధిచెందిన ప్రాచీన నాగరకతను చరిత్రకారులు మెసొపొటేమియా నాగరకత అని వ్యవహరిస్తున్నారు. మెసొపొటేమియా అనే పదానికి 'రెండు నదుల మధ్య దేశ' మని అర్థము. కాబట్టి ఆ పేరు సార్థకమైంది. ఈ నదులకు ప్రతి సంవత్సరమూ వరదలతోబాటు వచ్చిన ఒండ్రుమట్టితో లోయ సారవంతమై వ్యవసాయానికి అనువుగా ఉండేది. ప్రజలకు ప్రధాన ఆహారమైన ఖర్జూరము ఇక్కడ విరివిగా పండేది. మెసొపొటేమియా చుట్టూ ఎడారి ప్రాంతం కావడంవల్ల లోయలోనే జన నివాసాలన్నీ కేంద్రీకృతం అయినాయి. యూఫ్రేటీజ్–టైగ్రిస్ నదులకు మధ్య దూరం సగటున 20 మైళ్లు మాత్రమే. ఈ కారణాలవల్ల మెసొపొ


టేమియా నాగరకతా కేంద్రంగా పరిణమించింది. మెసొపొటేమియా నాగరకత మొదట యూఫ్రేటీజ్–టైగ్రిస్ లోయ దిగువ ప్రాంతం లోని సుమేర్ (Sumer) లో ప్రారంభమైంది. సుమేర్ పతనానంతరం ఈ ప్రదేశానికి ఉత్తరభాగంలో మెసొపొటేమియా నాగరకత వృద్ధిచెందింది. దీనికి 'అకడ్' (Akkad) అనే పేరు తరువాత వచ్చింది. మెసొపొటేమియాలో యూఫ్రేటీజ్ నదికి తూర్పుతీరాన ఉన్న బాబిలోనియా (Babylonia)లో బాబిలానుకు ఈశాన్యంగా, టైగ్రిస్ నదికి తూర్పువైపున ఉన్న అసీరియా (Assyria) లో తరవాత నాగరకత వృద్ధిచెందింది. యూఫ్రేటీజ్–టైగ్రిస్ లోయలో పరిణామం చెందిన మెసొపొటేమియా నాగరకతను అయిదు దశలుగా విభజించవచ్చును.

1. సుమేరియా (Sumeria) నాగరకత :
   సుమారు క్రీ. పూ. 3000–క్రీ. పూ. 2400.
2. అకాడియా (Akkadia) నాగరకత :
   సుమారు క్రీ. పూ. 2400–క్రీ. పూ. 2000.
3. అమొరైట్ (Amorite) నాగరకత :
   సుమారు క్రీ. పూ. 2000–క్రీ. పూ. 900.
4. అసీరియా (Assyria) నాగరకత :
   సుమారు క్రీ. పూ. 900–క్రీ. పూ. 600.
5. కాల్డియా (Chaldea) నాగరకత :
   సుమారు క్రీ. పూ. 600–క్రీ. పూ. 539.

## 1. సుమేరియా నాగరకత (Sumerian Civilization)

సుమేరియన్లు ఏ తెగకు చెందినవారో, ఎప్పుడు సుమేరియాకు వచ్చినారో నిర్ణయించడానికి ఇంతవరకు చాలినన్ని ఆధారాలు దొరకలేదు. కాని క్రీ. పూ. 3500 నాటికే వారు నాగరక జీవనాన్ని గడుపుతున్నట్లు తెలుస్తున్నది. మొదట్లో వీరు చిన్న చిన్న నగరరాజ్యాలను స్థాపించుకొన్నారు. వీటిలో ముఖ్యమైనవి

ఎరిడూ, ఉర్ (Ur), లాగష్ (Lagash), ఇరెక్ (Erech), నిప్పూర్ (Nippur), కిష్ (Kish), బాబిలన్ నగరాలు. కాలక్రమేణ ఈ నగరాలు




దేశపటము 2.
సుమేరియా నగరరాజ్యాలు

వృద్ధికావడం, పరస్పరం వివాదాలు పెరిగి యుద్ధాలు జరగడం, ఒక నగర రాజ్యము మరికొన్ని నగరాలమీద అధికత్వాన్ని సంపాదించడం సుమేరియా రాజకీయచరిత్రలోని ఒక ప్రక్రమము. కాని ఇప్పటివరకు దొరికిన చరిత్రాధారాలతో ఆ రాజకీయ చరిత్రను సమగ్రంగా చిత్రించడం కష్టము. పురాతత్త్వ పరిశోధనలవల్ల కొన్ని నగరాలను గురించిన విషయాలు మాత్రమే బయటపడినాయి. ఉదాహరణకు

లాగష్ నగరరాజ్య చరిత్రను పేర్కొనవచ్చు. ఇందువల్లనే సుమేరియాలోని నగరరాజ్య చరిత్ర ఏవిధంగా ఉండేదో తెలుస్తుంది. క్రీ.పూ. 2400 ప్రాంతంలో లాగష్‌ను పరిపాలించిన రాజులు పొరుగు రాజులతో పోరాటం జరిపినట్లు, దేవాలయాలను నిర్మించినట్లు మనకు తెలుస్తున్నది. లాగష్‌ను ఎదిరించిన ముఖ్యరాజ్యము లాగష్‌కు 20 మైళ్ళ దూరంలో పడమరగా ఉన్న ఊమ్మ (Umma). లాగష్‌ను ఏలిన రాజవంశంలో రెండోవాడైన ఎన్నటం (Eannatum) ఉమ్మను ఓడించి, ఇరెక్, ఊర్ రాజ్యాలను కూడా లోబరచుకొని 'కిష్ రాజ్యాధిపతి' (King of Kish) అనే బిరుదు వహించినాడు. ఎన్నటం తరవాత వచ్చిన రాజులు పన్నులుపెంచి, దేవాలయ భూములను ఆక్రమించి అహంకారంతో ప్రవర్తించినారు. ఊరుకజిన (Urukagina) అనే రాజు ఈ పరిస్థితులను చక్కబరచి న్యాయచట్టాన్ని అమలుపరచినాడు. ఊమ్మరాజైన లూగాల్‌జగిజి (Lugalzaggisi) లాగష్ అనైక్యాన్ని గుర్తించి లాగష్‌ను జయించి, ఊర్, ఇరెక్ రాజ్యాలను కూడా ఆక్రమించినాడు. లూగాల్‌జిగిజి అనంతరం సూమేరియా నాగరకత పతనం చెందింది.

**రాజకీయ వ్యవస్థ**

ప్రారంభంలో సుమేరియాలోని రాజ్యాంగపద్ధతి ప్రాథమిక దశలో ఉన్న ప్రజాస్వామ్యా (Primitive Democracy) న్ని పోలి ఉండేది. నిర్ణయాలను గురుజన సమితి (Council of Elders) గాని, ప్రజాసభ (Assembly of the People) గాని తీసుకొనేవి. తరవాత నగరరాజ్యాలు, రాజుల పాలన ఏర్పడినాయి. రాజే సైన్యాధ్యక్షుడుగాను, మతాధిపతిగాను ఉండేవాడు. సుమేరియాలో, నగర రాజ్యాలు నిరంతరము ఒకదానితో ఒకటి పోట్లాడుతూ ఉండడంవల్ల యుద్ధనైపుణ్యం అలవరచుకోవడం జరిగింది. సుమేరియన్లు రథాలు, శిరస్త్రాణాలు, బల్లేలు, ధనుర్బాణాలు ఉపయోగించినట్లు తెలుస్తున్నది. యుద్ధ సమయాలలో శస్త్రాస్త్రధారులై క్రమశిక్షణ ఉన్న సైనికులను నగరాధ్యక్షులు నడిపిస్తూ నాలుగు చక్రాలు ఉన్న భారమైన రథాలతో శత్రువులను ఎదుర్కొనేవారు.

## ఆర్థిక వ్యవస్థ

సుమేరియన్లు మంచినీటి జలధారలను వశపరచుకొని వీటిని అవసరం వచ్చినపుడు వాడుకోడం, పంటకాలవలు తవ్వి నీరు పారించడం, ధాన్యం పండించడం, నేర్చి ఉన్నారు. వారి పంటలలో ముఖ్యమైనవి బార్లీ, గోధుమలు, తిలలు, ఉల్లిపాయలు, బీన్సు, ఖర్జూరాలు, దానిమ్మపండ్లు. వారు పశువులను, మేకలను, గొర్రెలను పెంచుతూ ఉండేవారు. సుమేరియన్లు లోహపు పనిలో నేర్పరులు. బంగారు, వెండి, సీసము వాడుకలో ఉండేవి. వారు రాగితో అనేక పాత్రలు, ఆయుధాలు, పనిముట్లు, అలంకరణ సామగ్రి, దేవతా విగ్రహాలు చేసేవారు. వ్యవసాయము, పశుపాలన సుమేరియన్ నాగరికతలో ముఖ్య ధనాదాయ వృత్తులుగా ఉండేవి. ఉన్నితో దుస్తులు తయారు చేసేవారు. లోహ సామగ్రి, ఉన్ని వస్త్రాలు, ఖర్జూరము, ధాన్యము ముదలైన వస్తువులతో వారు పశ్చిమ ఆసియా దేశాలన్నిటితో వ్యాపారం సాగిస్తూ ఉండేవారు. రసీదులు ఇచ్చి పుచ్చుకోడం, వ్యాపారపు ఒప్పందాలు చేసుకోడం, పద్దులు తయారుచేయడంలాటి వ్యాపార పద్ధతులలో సుమేరియన్లు నిపుణులు. వారి ఆర్థిక విషయాలనుగురించి పురావస్తు సంబంధమైన త్రవ్వకాలలో దొరికిన క్యూనియ ఫారం (Cuneiform) లిపిలో వ్రాసిన లేఖ్య ప్రమాణాలవల్ల తెలుస్తున్నది.

## సాంఘిక జీవనము — మతము

సుమేరియన్ నగర జనులలో ముఖ్య తరగతులవారు రాజవంశీయులు, పురోహితులు, రాజోద్యోగులు, ఉచిత పట్టాదారులైన కృషీవలులు, బానిసలు, పురోహితవర్గము, విద్య విజ్ఞానాధిక్యాలచేత, వర్గ నిర్మాణక్రమంచేత సంఘంలోను, రాజకీయరంగంలోను మతానికి, దానిమూలంగా తనకు ప్రధానస్థానం లభించేట్లు చేసింది. సుమేరియాలో అనేక స్థానీయ మతాలుండేవి. సుమేరియన్లు చాలామంది దేవతలను ఆరాధించేవారు. ఆరాధ్య దైవాలలో కొందరు వ్యక్తిగత దేవతలు, కొందరు స్థానిక దేవతలు, కొందరు జాతీయ దేవతలు, మరి


కొందరు విశ్వదేవతలు, ఆకాశ అధిపతి అయిన 'అన్' (An) దేవతలందరిలో అగ్రగణ్యుడు. విశ్వక్రమానికి కారకుడైన దేవత ఎన్‌లిల్ (Enlil). మానవనాగరకతకు కారకుడైన విద్యాదేవత ఎన్‌కి (Enki). వీరు కాక ఇతర దేవతలలో ముఖ్యులు ఖగోళాధిపతి అయిన 'నన్నర్' (Nannar), సూర్యదేవుడైన 'ఊటు' (Utu), కామదేవత అయిన 'ఈనన్న' (Inanna). సుమేరియన్లకు పరలోకాన్ని గురించి అంతగా దృఢాభిప్రాయాలు లేవు. మంచివారు, చెడ్డవారు అందరూ భూమికి కిందగా, చీకటిగా ఉండే ప్రదేశానికి పోతారని వారు నమ్మేవారు. చనిపోయినవారిని సుమేరియన్లు నగరంలోనే ఇంటి పెరడులోగాని లేదా గదిలోగాని పాతిపెట్టేవారు. ఒక మనిషి చనిపోతే అతని గృహకృత్య సామగ్రి అంతా పరలోకంలో అవసరమని వారు నమ్మేవారు. అందువల్ల అతనికి పరలోకంలో లోటురాకుండా అతనితోబాటు నౌకర్లను, పశువులను ఇతరమైనవి ఖననంచేసి అతనికి పరలోకంలో అవసరమైనవాటిని సమకూర్చినట్లు నమ్మేవారు.

సుమేరియన్ నగరంలో ముఖ్యప్రదేశం దేవాలయ ప్రాకారము. ధనికులైన మఠాధిపతులు ఇక్కడ అధికారం చెలాయించేవారు. శిష్యుల సహాయంతో వారు దేవస్థానం ఆస్తులమీద అద్దెలు వసూలు చేసి దేవస్థాన సంరక్షకులుగా ఉండేవారు. దేవాలయము ధనాగారంగా కూడా పనిచేస్తుండేది. దేవుని పేర అప్పులు ఇవ్వడం, వడ్డీలు వసూలు చేయడం జరిగేది.

## సంస్కృతి

### లిపి

పురావస్తు పరిశోధనమూలంగా సుమేరియన్‌ల చిత్రరూపకమైన లిపిని గురించి తెలిసింది. బంకమట్టి పలకలమీద గట్టి వెదురు పుల్లతోగాని ఎముకతోగాని, కొయ్యతోగాని తయారుచేసిన 'స్టైలస్' (Stylus) అనే పరికరంతో వారు చిత్రించేవారు. ఆ బంకమట్టి పలకలు ఎండలో ఎండి, శాశ్వతమైన చారిత్రక లేఖనాలుగా ప్రసిద్ధికెక్కినాయి.




చిత్రపటము 6. సుమేరియాలిపి

ఈ లిపికి క్యూనియఫారమ్ (Cuneiform) లేదా పంగలకట్టె లిపి అని పేరు. లాటిన్‌భాషలో కూన్యూస్ అంటే పంగలకట్టెలాగా విడివడి నటువంటిది అని అర్థము. స్టైలస్ కొనను మట్టిలో ఆనించిపెట్టి రెండో వైపు పైకితీసినప్పుడు ఆ స్టైలస్ ఆకారం నొక్కుపడుతుంది. అది పంగలకట్టెలాగా విడివడి పైన మోటుగాను, చివర సన్నంగానుఉన్న గుర్తుపడుతుంది. కాలక్రమేణ ఈ గుర్తులతో వ్రాసిన బొమ్మలను

4406



గుర్తుపట్టడం కష్టతరమై బొమ్మలపోలికే నశించింది. సుమేరియన్‌ల లిపి చివరికి ఆరువందల గుర్తులుగా నిలిచింది. దీంట్లో భావసంకేతాలు (Ideograms), ధ్వనిసంకేతాలు (Phonograms) కూడా ఉన్నాయి. భావసంకేతాలు వస్తువులను గాని, భావాలను గాని తెలుపుతాయి. ధ్వని సంకేతాలు శబ్దములను తెలుపుతాయి.

## శాస్త్రాలు

సుమేరియన్‌ల సంఖ్యామానం దశాంశ, షష్ఠాంశాల మేళవింపు. అంటే ఒకట్లు, పదులు, అరవైలకుగుర్తులు ఉన్నాయి. ఈ గుర్తులు, మనము అంకెలు వేసినట్లే వేసినారు. కాని, ఒకట్లు, పదులు వందలకు బదులు ఆరుపదులుగా విభజించిఉన్నాయి. కాలమానానికి సుమేరియన్లు ప్రతి అమావస్యనుంచి మరుసటి అమావస్యకు ఒక నెలగా ఏర్పరచుకొన్నారు. పన్నెండు నెలలకు ఒకపడాది. కాని ఏడాదికి కొద్దిగా తక్కువగా ఉండడంవల్ల ఒకనెల తక్కువగానే ఇంకొకనెల పొడిగించి 13నెలలుగా చేసేవారు. సంవత్సరాలకు సంఖ్యను గాని, లేదా ఒక ముఖ్యసంఘటనను సూచించే పేరుగాని సుమేరియన్లు పెట్టేవారు.

## కళలు

సుమేరియన్లు అనేక దేవాలయాలు, రాజప్రాసాదాలు నిర్మించినారు. వారికి రాయి సులభంగా దొరకనందువల్ల, కట్టడాలను ఇటికలతో నిర్మించినారు. గుల్లలు, సున్నపురాయి, లోహాలతో చెక్కిన బొమ్మలలో సుమేరియన్‌ల పనితనం కనిపించినా పెద్దచిత్రాలలో వీరి శిల్పచాతుర్యం అంతగా కనిపించదు. ఊర్, లాగాష్, నిప్పూర్, కిష్ మొదలైన తవ్వకాలలో బయల్పడిన భవనాలు, దేవాలయాలు, వ్రాత ఫలకాలు సుమేరియన్‌ల కళాజీవితాన్ని చాటుతున్నవి.


సుమేరియన్ నాగరకత ప్రపంచనాగరకతకు నాంది పలికింది. ప్రపంచచరిత్రలో రాజ్యాలు, సామ్రాజ్యాలు, నీటిపారుదల విధా

నాలు, వెండి బంగారాల ద్రవ్యవిధానం, వ్యాపార వాణిజ్యపద్ధతులు, న్యాయచట్టాలు, వ్రాతవిధానాలు, ప్రపంచసృష్టిని గురించిన గాథలు, విద్యావిధానం, దేవాలయాలు, అలంకరణలు, వాస్తు చిత్ర శిల్పకళా ఖండాలు, సారస్వత రచనలు మొట్టమొదటగా ఏర్పడింది సుమేరియాలో. అంతేకాదు, ప్రపంచచరిత్రలో బానిసతనపు విధానము, నిరంకుశత్వ పరిపాలనము, మతాధికార దుర్వినియోగము, సామ్రాజ్య విస్తరణ కోసం యుద్ధాలు మొట్టమొదటగా సుమేరియాలో కనబడుతున్నాయి. అందుకని నేటి నాగరకత లక్షణ విలక్షణాల పుట్టుక సుమేరియా నాగరకత కాలంలోనే జరిగిందని చెప్పవచ్చు.

## 2. అకాడియా నాగరకత (Akkadian Civilization)

ఉమ్మ రాజైన లూగాల్ జగిజిని క్రీ.పూ. 2400 ప్రాంతంలో సెమిటిక్ (Semitic) వంశీయుడైన సార్గన్‌ను (Sargon) ఓడించి సుమేర్ ఆధిపత్యాన్ని అంతంచేసినాడు. ఊర్, లాగాష్, ఈలమ్ (Elam) మొదలైన నగరాలను జయించి అతడు తన రాజధానిని బాబిలాన్ సమీపంలోఉన్న అకడ్‌లో నెలకొల్పినాడు. అకడ్ నగరం యథార్థంగా స్థాపించిన చోటు తెలియడంలేదు. కాని మెసొపొటిమియా ఉత్తరభాగానికి అకడ్ అనేపేరు తరవాత వచ్చింది. మెసొపొటేమియా దక్షిణ భాగానికి సుమేర్ అనేపేరే నిలిచింది. అకడ్ రాజ్యం నారామ్‌సిన్ (Naram-sin — సుమారు క్రీ.పూ. 2250) కాలంలో విస్తరించింది. తరవాత అంతఃకలహాల మూలంగా క్షీణించి ఉత్తరంనుంచి క్రీ. పూ. 2150లో వచ్చిన గుతి (Guti) జాతి దండయాత్ర ఫలితంగా అకడ్‌రాజ్యం అంతమైంది. గుతిజాతిని ఇరెక్ రాజైన ఊతుకెఘల్ (Utukhegal) ఓడించడంతో మెసొపొటేమియా నాగరకతకు సుమేర్ మళ్ళా కేంద్రస్థానమైంది. ఈ కాలంలో ఊర్‌లో ప్రఖ్యాతిచెందిన మూడో వంశాన్ని ఊర్‌నమ్ము (Ur-Nammu) క్రీ. పూ. 2125లో స్థాపించినాడు. ఇతడు ఎరిడూ (Eridu) లాగాష్, ఉమ్మ, అదబ్, (Adab) నిప్పూర్ నగరాలను జయించి గొప్పసామ్రాజ్యాన్ని నెలకొల్పినాడు. ఊర్ పట్టణంలో

అనేక భవనాలను నిర్మించి నగరశోభను ద్విగుణీకృతం చేసినాడు. ఇతడు కట్టించిన నిర్మాణాలలో అతిముఖ్యమైనది జిగ్గురాత్ (Ziggurat-చిత్రపటము 7). ఇది మిగతా భవనాలకంటె ఎత్తుగాఉండి గోపురము త్రికోణాకృతిలో ఆకాశంలోకి చొచ్చుకొని పోయినట్టు ఉండేది.



చిత్రపటము 7. జిగ్గురాత్

మూడు అంతస్తుల మెట్లుఉండి పైన ఒకద్వారందగ్గర అంతమైంది. పై అంతస్తులో డాబాపై ఒకచతురస్రమైన దేవాలయముండేది. మత దృష్ట్యా, వాస్తుదృష్ట్యా ఇది ముఖ్యమైనది. ఊర్ నమ్ము 18 సంవత్సరాలు పరిపాలించినాడు. అతని తరవాత రాజ్యానికివచ్చిన షుల్గి (Shulgi) దాదాపు అర్థశతాబ్దం పాలించినాడు. ఇతడు సుమేర్, అకడ్, ఈలమ్, అసీరియా ప్రదేశాలను ఏకసామ్రాజ్యం కిందికి తెచ్చినాడు. తిరుగుబాట్లు లేక సామ్రాజ్యంలో సుస్థిరతను నెలకొల్పినాడు. అతని మరణానంతరము షులిని దేవునిగా పూజించినారు. క్రీ. పూ.

2000లో ఐదోరాజైన ఇబ్బి-సిన్ (Ebbi-Sin) కాలంలో అమొరైట్ తెగ దండయాత్ర ఫలితంగా ఊర్ సామ్రాజ్యం అంతమైంది.

ఊర్ మూడోవంశం తరవాత సుమేరియన్ల ఆధిపత్యం ముగిసింది. మెసొపొటేమియాలో సెమైట్ జాతివారు ప్రాముఖ్యం సంపాదించినారు. కాని మెసొపొటేమియా నాగరకత సుమేరియన్లు వేసిన పునాదులపై నే వృద్ధిచెందింది.

## 3. అమొరైట్ నాగరకత (Amorite Civilization)

ఊర్ రాజ్యము పతనంచెందిన తరవాత మెసొపొటేమియాలో అనైక్యం ప్రబలింది. సుమేర్, అకడ్ దేశాలుమూడు చీలికలైనాయి. ఇవి దక్షిణాన లార్స రాజ్యము, (Larsa) మధ్యదేశంలో ఐసిన్ (Isin) రాజ్యము, ఉత్తరభాగంలోని బాబిలన్ రాజ్యము. బాబిలన్ మధ్యధరా ప్రాంతాలను, ఉత్తరానఉన్న పర్వతాలను కలిపే రస్తాలో ఉండడం వల్ల చాలా ప్రాముఖ్యం పొంది మూడు రాజ్యాలలోకి ప్రధానమైనదిగా పరిణమించింది. క్రీ. పూ. 1900లో పశ్చిమ సెమైట్ జాతివారైన అమొరైట్‌లు బాబిలన్‌ను వశంచేసుకొన్నారు. వీరు క్రీ.పూ. 18వ శతాబ్దానికి బాబిలన్ సామ్రాజ్యాన్ని నిర్మించినారు. దీనినే మొదటి బాబిలోనియన్ సామ్రాజ్యమని అంటారు. అమొరైట్ వంశంలో మహోఖ్యాతి సంపాదించినవాడు ఆరో రాజైన హామూరాబీ (Hammurabi). ఇతడు 43 సంవత్సరాలు పరిపాలించినాడు.

### హామూరాబీ (Hammurabi)

హామూరాబీ అమలుపరచిన ధర్మశాస్త్రాన్ని గురించినఫలకాలు పురాతత్త్వ శాస్త్రజ్ఞుల తవ్వకాల మూలంగా బయల్పడడంతో అతని ప్రజ్ఞను గురించి, ఆ కాలపు వ్యవహారాలు, ఆచారాలు, శాస్త్ర విధానాలను గురించి తెలిసింది. ఈ తవ్వకాలలో యూఫ్రేటిజ్ దగ్గర మరి (Mari) అనేచోట ఫ్రెంచి పురాతత్త్వ శాస్త్రజ్ఞుడు చేసిన తవ్వకాలు చాలా ముఖ్యమైనవి. ఇక్కడ క్యూనియఫారమ్ లిపిలో వ్రాసిన 20,000 ఫలకాలతోబాటు 'మరి'ని ఏలిన రాజులకు వారి గూఢ

చారులూ రాజోద్యోగులూ, హామూరాబీ యుద్ధతంత్రం గురించి వ్రాసిన లేఖలు దొరికినాయి. ఆనాటి పరిస్థితులను అవగాహన చేసుకోడానికి ఇవి బాగా ఉపకరిస్తున్నాయి.

లార్స, ఆసీరియా, మరి, ఈష్నన్న, (Eshnunna) ప్రదేశాలను హామూరాబీ జయించి ఊర్ మూడవ వంశం స్థాపించిన సామ్రాజ్యమంత విస్తృతమైన సామ్రాజ్యాన్ని నెలకొల్పినాడు. ప్రపంచ చరిత్రలో ఇతడు గొప్ప ధర్మ శాస్త్రవేత్తగా పేరు పొందినాడు. తాను రాజ్యానికి రాకపూర్వమున్న చట్టాలను క్రోడీకరించినాడు. దీనికే 'హామూరాబీ న్యాయశాస్త్ర' (Code of Hammurabi) మని పేరు వచ్చింది. ఇందులో సివిల్, క్రిమినల్, చట్టాలకు సంబంధించిన విషయాలు ఉన్నాయి. ఏ పరిస్థితులలో ఏలాటి శిక్షను విధించాలో నిర్దిష్టమయింది. ఉదాహరణకు ఒక ఇల్లు కూలిపోయి గృహ యజమాని కుమారుడు మరణిస్తే ఆ గృహాన్ని నిర్మించిన స్థపతి కుమారునికి మరణదండన విధిస్తారు. ఈ విధంగా హామూరాబీ ధర్మాలలో కొన్ని నేడు అసాధారణంగా కనిపిస్తాయి. చాలా నేరాలకు శిక్ష మరణదండనే. హామూరాబీ చట్టాలలో వివాహము, విడాకులు, వారసత్వము, దత్తత, మొదలైన విషయాలకు సంబంధించిన ధర్మపరిష్కారాలున్నాయి. స్త్రీలకు చాలా హక్కులు ఉండేవి. భర్త సరిగా చూడకపోతే భార్య పుట్టింటికి వెళ్ళవచ్చు. స్త్రీలకు పురుషులతో సమానమైన వ్యాపార హక్కులు ఉండేవి. కాని అప్పుల పాలైన భర్త భార్యను ఆ అప్పులను తీర్చే నిమిత్తం విక్రయించవచ్చు. వ్యవసాయము, వ్యాపారము, నౌకాయానము, వెలలు, బత్తాలు, మొదలైన విషయాలన్నీ హామూరాబీ ధర్మశాస్త్రంలో వివరంగా ఉన్నాయి. సుమేరియా నాగరకతలోలాగా కాక మతసంస్థల, రాజుల ఆర్థికాధిక్యము తగ్గింది. అనేకధనికులు వ్యవసాయ, వ్యాపార రంగాలలో ప్రసిద్ధులైనారు. విదేశ వ్యాపారము అభివృద్ధికి వచ్చింది. నాటి ఎగుమతులలో ముఖ్యమైనవి వస్త్రాలు, వెండి, నూనెలు; దిగుమతులలో రాగి, బంగారము, దంతాలు, ముఖ్య

మైనవి. సారస్వతము, గణితము, ఖగోళశాస్త్రము, హామూరాబీ కాలంలో వృద్ధిచెందినాయి.


ప్రాచీన ప్రపంచ చరిత్రలో ఖ్యాతివహించిన పరిపాలకులలో హామూరాబీ ముఖ్యుడు. ఇతడు తాను రాజ్యానికి రాకపూర్వం ఉన్న చట్టాలను క్రోడీకరించి, ప్రపంచానికి మహోపకారం చేసినాడు. ఇతడు చాలా చిన్న నేరాలను కూడా స్వయంగా విచారించి ప్రజలకు న్యాయం చేయడానికి యత్నించినాడు. అతడి న్యాయశాస్త్రంలో మొదట ఇలా ఉన్నది: "నా హృదయంలో ఎప్పుడూ బాబిలన్ ప్రజ లుంటారు. వారు నా సంతానంతో సమానులు. ఈ న్యాయశాస్త్రము బలహీనులను, భర్తృహీనులను, అనాథలను, రక్షించడానికే ఏర్పాట యింది." దీన్నిబట్టి ఇతని తరవాత ప్రపచం చరిత్రలో వన్నె కెక్కిన భారతీయ చక్రవర్తి అశోకుడులాగా హామూరాబీ ప్రజలను తన సంతానంలాగా ఆదరించి వారి శ్రేయస్సును ధ్యేయంగా పెట్టుకొని పరిపాలన కొనసాగించినట్లు విశదమౌతున్నది.

హామూరాబీ తరవాత అంతవాడు అమొరైట్లలో పుట్టలేదు. హామూరాబీ అనంతరము అమొరైటుల అధికారము క్షీణించసాగింది. క్రీ. పూ. 1600లో ఆసియా మైనర్ నుంచి వచ్చిన హిటైటుల (Hittites) దండయాత్ర ఫలితంగా అమొరైటుల ఆధిపత్యము అంతరించింది. హిటైటులు ఇనుప ఆయుధాలను, అశ్వబలాన్ని, చాక చక్యంగా ఉపయోగించడం అమొరైటుల అపజయానికి ప్రధాన కారణాలు. కాసైట్స్ (Kassites) అనే అనాగరకమైన తెగ బాబిలో నియామ జయించి 600 సంవత్సరాలు పాలించింది. దాన్ని ఓడించి అసీరియన్లు సామ్రాజ్యాన్ని స్థాపించినారు. దీనికే అసీరియా సామ్రాజ్యమని పేరు.

## 4. అసీరియా నాగరకత (Assyrian Civilization)

అసీరియా దేశము టైగ్రిస్ నదీ తీరంలో సుమేర్, అకడ్, దేశాలకు వాయువ్యంగా ఉండేది. పర్వత ప్రాంతమైన అసీరియా దేశానికి తూర్పున, ఉత్తరాన పర్వతాలు, పశ్చిమాన ఎడారిప్రాంతము,

ఉండేవి. అసీరియా విస్తీర్ణము 10,000 చ. మై. క్రీ. పూ. 4000 నాటికే ఇక్కడ గ్రామీణ జీవనమున్నట్లు భూగర్భ పరిశోధనల వల్ల తేలింది. అసీరియా కొండప్రదేశం అవడంచేత, ఎల్లప్పుడూ పరిసర ప్రాంతాల దండయాత్రాభయము ఉండడంవల్ల అక్కడి ప్రజలు దృఢ కాయులుగా, ధైర్యస్థులుగా ఉండి అప్రమత్తతతో మెలిగేవారు. అకడ్ రాజైన సార్గన్ కాలంలో, ఊర్‌ను మూడవ రాజవంశం పాలించే కాలంలో అసీరియా అనేక దండయాత్రలకు గురయింది. కాని క్రీ.పూ. 2000 ప్రాంతంలో స్వతంత్ర రాజ్యమై బాబిలన్‌ను ఏలిన అమొరైట్‌లను ఎదిరించింది. క్రీ. పూ. 1450 నుంచి 1400 వరకు మిటానియన్ (**Mitannian**) రాజ్యంలో ఒక భాగంగాఉండి మళ్ళీ స్వాతంత్ర్యాన్ని పొందింది. క్రీ. పూ. 900 నుంచి అసీరియా అభ్యుదయము మొదలయింది (దేశపటము 3).




దేశపటము 3.

అసీరియా సామ్రాజ్యము (సుమారు క్రీ పూ. 625)

## ఆషూర్ నజిర్‌పాల్ II (Ashurnazirpal II)

(క్రీ. పూ. 885 నుంచి క్రీ. పూ. 858 వరకు)

అసీరియా సామ్రాజ్యాన్ని ప్రథమంలో ఏలిన రాజులలో ముఖ్యుడు రెండవ ఆషుర్ నజిర్‌పాల్. ఇతడు క్రీ.పూ. 885 నుంచి క్రీ. పూ. 858 వరకు పరిపాలించినాడు. మొదట్లో అసీరియా రాజధాని ఆషూర్ (Ashur). అది తరవాత కలాఖ్ (Kalakh) నగరానికి మారింది. ఈ నగరానికి నేడు నిమ్రూద్ (Nimrud) అని పేరు. ఒక శతాబ్దానికి పూర్వమిక్కడ సర్ ఆస్టిన్ హెన్రీ లయర్డ్ (Sir Austen Henry Layard) చేసిన భూగర్భ పరిశోధనల ద్వారా ఆషూర్ నజిర్ పాల్ II ను గురించిన విషయాలు తెలిసినాయి. ఇతడు అసీరియా సామ్రాజ్యాన్ని తన ఘన విజయాలు కారణంగా నాలుగువైపులకూ వ్యాపించేటట్లు చేసినాడు. దండయాత్రలలో సేనలను మధ్యధరా సముద్రతీరందాకా నడిపించినాడు. ఇటైట్ రాజులను ఓడించి ఫొనీషియన్ నగరాలు కప్పం చెల్లించేటట్లు చేసినాడు. ఆషూర్ నజిర్ పాల్ II నీటి పారుదల సౌకర్యాలను పెంపొందించి అనేక నగరాలను అందంగా పునర్నిర్మించ జేసినాడు.

ఆషూర్ నజిర్‌పాల్ II తరవాత కొన్ని శతాబ్దాలు అసీరియా ఆధిపత్యము తగ్గిపోయింది. మళ్ళీ రెండో సార్గన్ రాజు (క్రీ. పూ. 722–705) కాలంలో అసీరియా సామ్రాజ్యము బలపడింది. ఇతడు క్రీ. పూ. 722 లో రాజయినాడు. హీబ్రూ (Hebrew) పట్టణమైన సమారియాను జయించి ఇజ్రాయిలీల (Israelites)ను అణిచివేసినాడు. ఇతడు సిరియా, సైలీషియా (Cilicia), ఫిలిస్టియా (Philistia), హాల్డియా (Haldia), మొదలైన దేశాలను జయించినాడు.

రెండో సార్గన్ మరణానంతరం అతని కుమారుడు సెనెకరిబ్ (Sennacherib) (క్రీ.పూ. 704 నుంచి క్రీ.పూ. 681 వరకు) రాజ్యానికి వచ్చినాడు. ఇతడు తన తండ్రిలాగానే అనేక దేశాలను జయించినాడు. ఆసియా మైనర్ తూర్పుకొనలోఉన్న శత్రువులకు సైతం ఇతని పేరు సింహస్వప్నంగా ఉండేది. మధ్యధరా ప్రాంతంలోని ఫీనిషియన్ రేవు

పట్టణాలను జయించి ఇతడు ఈజిప్టు సరిహద్దులవరకూ అసీరియన్ సామ్రాజ్యాన్ని విస్తరించినాడు. ఇతని యుద్ధాలలో ప్రఖ్యాతమైనది జూడా రాజైన హెజెకైయా (Hezekiah)తో చేసినది. సెనెకరిబ్ చాలా సమర్థుడైన పరిపాలకుడు. బాబిలోనియా సంస్కృతి మీద తనకున్న అసూయవల్ల క్రీ. పూ. 689 లో బాబిలన్ ముట్టడించి ఆ నగరాన్ని ధ్వంసంచేసినాడు. తరవాత అతని కుటుంబంవారే అతని మీద తిరుగుబాటు చేసి హత్య చేసినారు.

సెనెకరిబ్ తరవాత సామ్రాజ్యంలో చాలా తిరుగుబాట్లు జరిగినాయి. కానీ సెనెకరిబ్ కుమారుడు ఈసార్‌హడ్డాన్ (Esarhaddon) వాటిని అణిచివేసినాడు. తండ్రి ధ్వంసంచేసిన బాబిలన్ నగరాన్ని పునర్నిర్మించినాడు.

పేరుమోసిన అసీరియా రాజులలో చివరివాడు ఆషూర్ బనీపాల్ (Ashurbanipal) ఇతడు క్రీ. పూ. 688 నుంచి క్రీ. పూ. 624 వరకు రాజ్యపాలన చేసినాడు. ఈజిప్టు, ఈలమ్, బాబిలన్ మొదలైన దేశాలను జయించినాడు. సాహిత్యాన్ని, చిత్రకళలను పోషించినాడు. రాజధాని నినెవె (Nineveh) నగరంలోను, ఇతర స్థలాలలోను, గొప్పకట్టడాలను కట్టించినాడు. అసీరియన్, బాబిలోనియన్, రచనలను సేకరించి ఒక మహాగ్రంథాలయాన్ని నిర్వహించినాడు. ఆషూర్ బనీపాల్ చివరిరోజులలో అసీరియా సామ్రాజ్యము పతనంకాబోతున్నదని గ్రహించి దుఃఖించినాడు. క్రీ. పూ. 612లో రాజధానీ నగరమైన నినెవె పతనంచెందడంతో అసీరియా సామ్రాజ్యము అంతరించింది.

అసీరియా సామ్రాజ్యము అంతరించినా అసీరియా నాగరకత చరిత్రమీద చెరగనిముద్రవేసింది. బాబిలోనియా, అసీరియా, సిరియా, పాలస్తీన్, దేశాలతో ఇరాన్‌నుంచి నైలునది డెల్టా వరకు వ్యాపించిన అసీరియా సామ్రాజ్యము ప్రాచీన రాజ్యాలలో చాలా పెద్దది. అసీరియన్లు సుమేరియన్, బాబిలోనియన్, నాగరకతలనుంచి అనేక విషయాలు గ్రహించినా ఆసంస్కృతులను పూర్తిగా అనుకరించలేదు.

ఇందువల్లనే అసీరియన్ సంస్కృతిలో ఒక విశిష్టత కనబడుతుంది. ఫొనీషియన్‌లనుంచి, హిటైటులనుంచి, అసీరియన్లు కొన్ని మంచి విషయాలు గ్రహించినారు.

## రాజకీయ వ్యవస్థ

దేశాధిపతి రాజు. ఇతడు దైవనియుక్తుడని భావించేవారు. సామాన్యంగా యువరాజుగా ఉండగానే అతణ్ణి రాజ్యతంత్రంలో తర్ఫీదు చేసేవారు. ఆషూర్ బనీపాల్ శాసనాలద్వారా ఈ విషయం తెలుస్తుంది. ఆషూర్ బనీపాల్ యువరాజుగా గణితము, ఖగోళ శాస్త్రము, జ్యోతిషము, వివిధలిపిపరిణామాలు నేర్చినాడు. రాజ్య తంత్రము, యుద్ధవిద్య, పరిపాలనపద్ధతులు, మొదలైన వ్యవహారాలలో నైపుణ్యాన్ని సంపాదించినాడు. ఏ విషయంలోనైనా పరిపక్వత, ప్రావీణ్యము సంపాందించడమే అసీరియా రాజుల ధ్యేయము.

అసీరియన్ ప్రభుత్వంలోని ముఖ్యాధికారులు ముఖ్యమంత్రి, సైన్యాధిపతి, రాష్ట్రపాలకులు, నగర ప్రతినిధులు. రాజుకు పెద్ద పరివారముండేది. రాజే దేశానికి ప్రధాన పురోహితుడుగా భావించ బడినా, ప్రతిదేవాలయంలోనూ పురోహితవర్గమంటూ ఒకటి వేరే ఉండేది. ప్రభుత్వంలో లేఖకులకు, శాసనశిల్పులకు, ప్రత్యేక స్థాన ముండేది.

అసీరియన్ సామ్రాజ్యంలోని ప్రధాన రంగాలు దేశరక్షణ, జైత్రయాత్రలు, దౌత్యకార్యము, ఆర్థికాభివృద్ధి పథకాలు. ఆ కాలంలో సైనికవర్గము రాజ్యానికి ప్రధానరంగంగా ఉండేది. రాజ్యమంతా ఒక పెద్ద సైనిక శిబిరంలాగా కనిపించేది. ప్రపంచంలో పెద్దపెట్టున ఇనప ఆయుధాలను ఉపయోగించిన మొట్టమొదటి సైన్యము అసీరియన్‌సేన. ముఖ్యంగా వీరి ఆయుధాలు విల్లమ్ములు, ఈటెలు, డాలులు. వీటికితోడుగా నినెవే ఆశ్వికు, రథాంగదళాలు, ప్రాచ్యదేశాలన్నిటిలో ప్రఖ్యాతమైనాయి. వారు ప్రత్యేక పద్ధతులను ఉపయోగించడం వల్ల ఎంతటి బలమైన కోటఅయినా సునాయా

సంగా వశమైపోతుండేది. అసీరియన్లు క్రూరంగా ప్రవర్తించడంవల్ల శత్రువులకు బెదురుగా ఉండేది. దారి పొడుగునా పట్టణాలనన్నిటినీ నాశనంచేసి తగలబెడుతూ అసీరియన్ సైన్యాలు శత్రురాజులను జీవంతోనే కొరతవేస్తుండేవి. జయించిన దేశాలను కొల్లగొట్టి వందల కొద్ది పశువులను, గుఱ్ఱాలను, స్వాధీనం చేసుకోవడమే కాక, బస్తాలతో వెండి బంగారాలను ఒంటెలమీద వేసుకొని వైభవంగా తిరిగి వచ్చేవారు. గూఢచారులు సేనలకు చాలా సహాయపడేవారు.

### ఆర్థిక వ్యవస్థ

అసీరియన్లు ప్రధానంగా గ్రామీణజీవనము గడిపేవారు. అసీరియాలో వ్యవసాయము, పశుపోషణ, ప్రధానవృత్తులుగా ఉండేవి. అక్కడ పండిన పంటలలో బార్లీ, గోధుమలు, ఉల్లిపాయలు, దోసకాయలు, ద్రాక్షపండ్లు మొదలైనవి ముఖ్యమైనవి. పశ్చిమదేశాలలో దొరికే లోహాల కోసం, మధ్యధరా సముద్రంలో ప్రాబల్యం సంపాదించడానికి వాటితో అసీరియా సంబంధము ఎక్కువ చేసుకొంది. అసీరియా వలసకేంద్రాలను స్థాపించడంలో ఆసక్తి చూపింది.

### మతము

బాబిలోనియాలోని పవిత్రదేవతలను, దేవతాచిహ్నాలను అసీరియన్లు అనుకరించినారు. కానీ, వారు తమతెగ దైవమైన అసుర్ (Asur)ను కూడా పూజించేవారు. అసీరియన్లు తాము యుద్ధవీరులుగా మారగానే అసుర్‌ను కూడా తమ యుద్ధదేవతగా భావించి సూర్యరూపంలో ఆరాధించినారు. ఈ దేవుడు అసీరియన్లకు యుద్ధంలో విజయంచేకూర్చి శత్రువులను నాశనం చేస్తాడని వారు నమ్మినారు. ఈ దేవునికి చిహ్నంగా వారు సిరియాలోని హిటైటుల నుంచి రెక్కలుగల సూర్యబింబాన్ని గ్రహించినారు. అసీరియన్ల దేవతలలో ఇష్టార్ (Ishtar) అనే ప్రేమదేవత ముఖ్యమైనది. దీన్ని బాబిలోనియానుంచి వారు గ్రహించినారు. బాబిలోనియన్లలాగానే అసీరియన్లు మత విషయాలలో ఎక్కువ పట్టింపులు పెట్టుకొనేవారు

కాదు. వీరు బాబిలోనియన్లలాగా చనిపోయినవారిని ఇంట్లోనో, పెరట్లోనో పాతిపెట్టేవారు.

**శాస్త్రాలు, కళలు**

అసీరియన్లు ప్రాచీన మెసొపొటేమియా నాగరకతను పరిరక్షించడానికి అనేక చర్యలను తీసుకొన్నారు. అషూర్ బనీపాల్ స్థాపించిన గ్రంథాలయంలో అనేక మత, చరిత్ర, సాహిత్య, శాస్త్రీయ, గ్రంథాలను భద్రపరిచినారు. వాటిలోకొన్నిటిని తర్జుమా చేసినారు. నిర్వాపితమవుతున్న భాషలకు, లిపులకు, కోశాలను నిర్మించినారు. నాటి వైద్య రసాయనశాస్త్ర గ్రంథాలనుబట్టి అసీరియన్లకు ఔషధాలను, ఖనిజాలను, గాజు వస్తువులను, తయారు చేయడం తెలుసునని చెప్పవచ్చు.

అసీరియన్లు చిత్ర శిల్ప కళలను బాగుగా పోషించినా, సార్గన్ రాజు దుర్ షరుకిన్ (Dur-Sharrukin)లో దేవాలయాలను, ఒక గొప్ప రాజప్రాసాదాన్ని, నిర్మించి దాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దినాడు. సెనెకరిబ్ వింతవింత వృక్షజాతులను సామ్రాజ్యం నాలుగుదిక్కులనుంచీ తెప్పించి నినెవే పట్టణానికి ఎగువన టైగ్రిస్ నదీతీరంలో తోటలను వేయించినాడు. ఈ తోటలకు కాలవలద్వారా నీరువచ్చే ఏర్పాటు చేసినాడు. నినెవేను రాజధానీ నగరంగా చేసి అక్కడ ఒక అద్భుతమైన అద్వితీయ రాజగృహాన్ని (Palace without a Rival) నిర్మించినాడు. అసీరియా దేశంలో రాళ్లు సమృద్ధిగా దొరకడంవల్ల, అవి దొరకని బాబిలోనియన్లు చేయలేకపోయిన పనులను అసీరియన్లు చేయగలిగినారు .అసీరియన్లు రాతి పునాదులపై ఇటిక గోడలు నిర్మించుకొనేవారు. తమ రాజుల శౌర్య ప్రతాప గాథలను రాతి పలకలమీద మలచుకోవడం కూడా నేర్చుకొన్నారు. శిల్పాలకు రంగులుకూడా వేసేవారు. ఈ రంగులు వెలిసిపోకుండా నేటికీ మెరిసిపోతున్నాయి.

అసీరియా సామ్రాజ్యం క్షీణించడానికి కారణాలు చాలా ఉన్నాయి. అసీరియన్ చక్రవర్తులు వ్యవసాయము, పరిశ్రమలు దేశ

సంపదను పెంపొందించడానికి కృషిచేయలేదు. పత్తివంటి పరిశ్రమలకు ఉపయోగకరమైన వస్తువులు లభించినా వారు పరిశ్రమలనుకాని, వ్యాపారాన్నికాని వృద్ధిచేయక సర్వదా సైన్యాలనే పెంపొందించడంలో ఎక్కువ శ్రద్ధను చూపినారు. సామ్రాజ్య విస్తరణకు కావలసిన సేనలను ఆయత్తపరచడానికి వ్యవసాయదారులను కూడా సైన్యంలో చేర్చుకొనినారు. ఇందువల్ల వ్యవసాయము మరింత దెబ్బతిన్నది. అసీరియా సామ్రాజ్య పతనానికి మరొక కారణము రాజులు తమ దేశంలోని సైనికులు చాలక తాము జయించిన విదేశాలలోనివారిని కూడా సైన్యాలలో చేర్చుకోవడం. ఈ విదేశీయులకు అసీరియాపై అభిమానం లేనందున సమయం దొరికినప్పుడు తిరుగుబాటు చేసేవారు. సామ్రాజ్యంలోని సామంతులు పలువురు తిరుగుబాటు చేయడం అసీరియా సామ్రాజ్యం క్షీణించటానికి మరొక కారణం.

## 5. కాల్డియా నాగరకత (Chaldean Civilisation)

క్రీ. పూ. 612 లో అసీరియా పతనం చెందినప్పటినుంచి, క్రీ. పూ. 550 లో పర్షియా అభ్యుదయం చెందినప్పటివరకూ ఉన్న మధ్యకాలంలో, సమీపప్రాచ్యంలో నాలుగు రాజ్యాలు ఏర్పడినవి. ఇవి 1. కాల్డియా రాజ్యము 2. మీడియా (Media) రాజ్యము 3. లిడియా (Lydia) రాజ్యము 4. సాఇట్ (Saite) రాజ్యము. ఇందులో కాల్డియా, మీడియా, సాఇట్ రాజ్యాలు అసీరియాతో పోరాడి స్వాతంత్ర్యాన్ని పొందినాయి. కాల్డియారాజ్యంలోని ముఖ్య దేశాలు బాబిలోనియా, అసీరియా, సిరియా, పాలస్తీన్, పశ్చిమ ఈరాన్, అర్మీనియా (Armenia) ఆసియా మైనరులో కొంత భాగం మీడియా రాజ్యంలో ముఖ్య దేశాలు. లిడియా రాజ్యం పశ్చిమ ఆసియా మైనరులో హాలిస్ (Halys) నది నుంచి ఈజియన్ (Aegean) సముద్రంవరకూ వ్యాపించింది. సాఇట్ రాజ్యము ఈజిప్టులో 26 వ వంశము పాలించే కాలంనాటిది. ఈ నాలుగు రాజ్యాలు మొదట్లో పరస్పరము యుద్ధాలు చేసుకొన్నా తరవాత తుల్య ప్రాబల్య సిద్ధాంతాన్ని అనుసరించినాయి. అంటే ఈ రాజ్యాలలో ఏ ఒక్కటిగాని

సర్వాధికప్రాబల్యం వహించి ఇతరులను శాసించగల స్థితి ఏర్పడనీయక పోవడం. ఈ రాజ్యాలు ప్రాచీన నాగరకతను పునరుద్ధరించడానికి యత్నించినాయి.

క్రీ. పూ. 626 లో బాబిలోనియాలో అధికారం చేపట్టిన నబోపోలసెర్ (Nabopolassar) అసీరియన్‌లపై చాలాసార్లు దండయాత్రలు చేసినాడు. చివరకు క్రీ. పూ. 612 లో నినెవె నగరం బాబిలోనియన్‌ల స్వాధీనమయింది. క్రీ. పూ. 605 లో కార్చెమిష్ (Carchamish) అనే ప్రదేశంలో ఈజిప్షియనులతో కలసి యుద్ధం చేస్తున్న అసీరియన్ సేనలను కాల్డియనులు పూర్తిగా ఓడించినారు. దీనితో సారవంతమైన చంద్రరేఖ అంతా కాల్డియన్‌ల వశమయింది.

## నెబుకెడ్‌నెజర్ (Nebuchadnezzar)

(క్రీ. పూ. 605 నుంచి క్రీ. పూ. 562 వరకు)

కాల్డియన్ చక్రవర్తులలో ప్రముఖుడు నెబుకెడ్‌నెజర్. ఇతడు క్రీ. పూ. 605 నుంచి క్రీ. పూ. 562 వరకు పరిపాలించినాడు. పరిపాలనారంభంలో చాలాసార్లు ఈజిప్టుతో పోరాడి, దానివల్ల ఫలితం లేదని గ్రహించి చివరకు క్రీ. పూ. 568 లో ఆ దేశంతో సంధి చేసుకొనినాడు. ఇతని యుద్ధాలలో ముఖ్యమైనవి జెరూసలమ్ (Jerusalem) పై సాధించిన ఘనవిజయాలు. క్రీ. పూ. 586 లో జెరూసలమ్‌ను పూర్తిగా జయించి చాలమంది హీబ్రూలను ఖైదీలుగా పట్టుకొన్నాడు. దీనినే బాబిలోనియన్ నిర్బంధము (Babylonian Captivity) అని అంటారు.

నిరంతరం యుద్ధాలలో మునిగితేలుతున్నా నెబుకెడ్‌నెజర్ బాబిలోనియా, మెసొపొటేమియాలలోని అనేక నగరాలలో దేవాలయాలను పునరుద్ధరించడమో, లేదా కొత్త ఆలయాలను నిర్మించడమో చేసినాడు. బాబిలన్‌ను సమీపప్రాచ్యమంతటికీ మిక్కిలి సుందరమైన నగరంగా తయారుచేసినాడు. నాడు ఈ నగర జనాభా సుమారు 80,000 ఉండేది. బాబిలన్ నగరంలో నెబుకెడ్‌నెజర్

నిర్మించిన పెద్ద జిగ్గురాత్ ప్రాచీన ప్రపంచంలో ఏడు వింతలలో ఒకటై, 'వ్రేలాడే తోట' అని (Hanging Gardens) పరిగణింపబడు తోంది.

నెబుకెడ్‌నెజర్ కాలంలో వర్తక వ్యాపారాలు అభివృద్ధి చెందినాయి. ఖగోళశాస్త్ర సహాయంతో భవిష్యత్తును తెలుసుకోవడం వారు నేర్చుకొన్నారు. అప్పటికి తెలిసిన గ్రహాలు ఐదు మాత్రమే. అవి: కుజుడు, శుక్రుడు, బుధుడు, గురువు, శని. ఈ గ్రహాలను ప్రజల భవిష్యత్తును నిర్ణయించే దేవతలుగా పరిగణించినారు. బాబిలోనియాలో ఈ గ్రహదేవతలకు దేవాలయాలు కట్టించినారు. ఈ ఐదు గ్రహాలు, సూర్యచంద్రులు కలిసి వారములోని ఏడు దినాలకు అధిదేవతలుగా పరిగణించి, ఒక్కొక్క దినమూ ఒక్కొక్క గ్రహాన్ని ఆరాధించడానికి యోగ్యమైనదిగా ఏర్పాటు చేసుకొన్నారు. ఆ దినము ఆ గ్రహం పేరుతోనే నేటికిని పిలువబడుతున్నది. జ్యోతిష శాస్త్రంతోపాటు ఖగోళశాస్త్రంకూడా ఈ కాలంలో ఎక్కువగా అభివృద్ధిచెందింది. సూర్యచంద్రుల పరిభ్రమణానికి ఎంతకాలం పడు తుందనే విషయము నిర్ణయమయింది.

నూతన అన్వేషణలతో ముందుకు సాగక పురాప్రాభవ పునరుద్ధరణకే ప్రాకులాడడం కాల్డియన్‌ల పతనానికి దారితీసింది. క్రీ. పూ. 562 లో నెబుకెడ్‌నెజర్ మరణంతో కాల్డియన్‌ల ప్రాభవం అంతరించింది. క్రీ. పూ. 539 లో పర్షియన్‌లు కాల్డియన్‌లను పూర్తిగా జయించినారు.

## ప్రపంచ చరిత్రలో మెసొపొటేమియా స్థానము

ప్రపంచచరిత్రలో మెసొపొటేమియాకు ముఖ్యస్థానమున్నది. నేటి మన నాగరికతలోని అనేక అంశాలు మెసొపొటేమియాలో విలసిల్లిన వివిధ నాగరకతల వారసత్వంనుంచి సంక్రమించినవే. వారానికి ఏడుదినాలు లెక్కించడం, గడియారాలలో 12 అంకెల వరకూ గుర్తించడం, గ్రహాలనుబట్టి జీవిత భవిష్యత్తు నిర్ణయించడం

గణితంలోని గణనము, 12 రాశులు, వృత్తాన్ని 360 డిగ్రీలుగా విభజించడం మొదలైన ఈనాటి పద్ధతులు మెసొపొటేమియా నాగరకతనుంచి గ్రహింపబడినాయి. సమకాలీన పర్షియా, ఫినీషియా, హీబ్రూ నాగరికతలపై మెసొపొటేమియా ప్రభావము అధికంగా ఉండింది. పర్షియన్లు కాల్డియా నాగరకతనుంచి అనేక విషయాలను గ్రహించినారు. క్రీ. పూ. 1750 లో బాబిలోనియన్లను జయించడానికి కాసైట్లకు సహాయంచేసిన హిటైట్లు, బంకమట్టి ఫలకాలను తయారుచేసే విధానాన్నీ, క్యూనియఫారమ్ వ్రాత పద్ధతినీ, మత ఆచారాలనూ బాబిలోనియన్లనుంచి నేర్చుకొనినారు. బాబిలోనియన్ మత ప్రభావము ఫినీషియన్లపై బాగా ప్రసరించింది. సుమేరియన్ మత ప్రభావము ముఖ్యంగా కాననైట్లపై కనబడుతున్నది. హీబ్రూలు ప్రధానంగా అనేక విషయాలను మెసొపొటేమియా నాగరకతనుంచి గ్రహించినారు. దీనికి ముఖ్య కారణము క్రీ. పూ. 586 నుంచి క్రీ. పూ. 539 వరకూ హీబ్రూలు బాబిలోనియన్ల నిర్బంధంలో ఉండడమే. ఈ నిర్బంధ కాలంలో హీబ్రూలు బాబిలోనియన్లను ఏవగించుకొన్నా వారి అనేక పద్ధతులను అలవరచుకొనినారు. హీబ్రూలకు వ్యాపారంమీద ఆసక్తి కాల్డియన్లను చూచిన తరవాత కలిగింది. జూడా మతంలోని చాలా నమ్మకాలు కాల్డియన్లనుంచి సంక్రమించినవే. గ్రీకు, రోమన్ నాగరికతలు కూడా మెసొపొటేమియాకు ఎంతో ఋణపడి ఉన్నాయి. ఉదాహరణకు, రోమనులు జ్యోతిషులను కాల్డియన్‌లు అని పిలిచేవారు. వారిని గౌరవించేవారు.